ప్రజాశక్తి
ఆదివారం 2 మార్చి 2025 5
శ్రీ సత్యసాయి

మంగళకర జూనియర్ కళాశాలలో జరుగుతున్న పరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టర్

నేరాల నియంత్రణే లక్ష్యం

◆ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ కృషి ఎనలేనిది

◆ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

◆ ఎస్ఐల పాసింగ్ అవుట్ పరేడ్‌లో రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత

ఎస్ఐల పాసింగ్ అవుట్ పరేడ్‌లో మాట్లాడుతున్న మంత్రి అనిత

పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి అనిత

ప్రతిభ కనబరిచిన శిక్షణ ఎస్‌కు బహుమతి అందిస్తున్న మంత్రి

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

రాష్ట్రంలో ప్రజలకు రక్షణగా నిలుస్తూ, నేరాల నియంత్రణే లక్ష్యంగా పోలీసు సిబ్బంది విధులు నిర్వహించాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. అనంతపురం పోలీసు శిక్షణ కళాశాలలో శిక్షణ పూర్తి చేసుకున్న 394 ఎస్‌సిటి ఎస్ఐల పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హోం మంత్రితో పాటు రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హోం మంత్రి మాట్లాడుతూ 394 మంది సబ్-ఇన్‌స్పెక్టర్లు శిక్షణను పూర్తి చేసుకుని విధుల్లోకి వెళ్తుండడం సంతోషంగా ఉందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో 97 మంది మహిళా అభ్యర్థులుండడం హర్షనీయం అన్నారు. పోలీసు ఉద్యోగం మిగతా ఉద్యోగాల వంటిది కాదని, ఇందులో 24 గంటలూ విధుల్లో ఉండాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. నిజాయితీ, నిష్పక్షపాతం, బాధితులపై సానుభూతి, విధిపట్ల నిబద్ధత పోలీసు ఉద్యోగంలో తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రజల ధన, మాన, ప్రాణాలను రక్షించి, నేరాలను కట్టుదిట్టంగా అరికట్టడానికి, చట్టాన్ని నిష్పక్షపాతంగా అమలు చేయడానికి సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరం వుందన్నారు. బాధితులకు న్యాయం చేయడం ద్వారా పోలీసు వ్యవస్థపై ప్రజలకు భరోసా కలుగుతుందన్నారు. ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందింపుచ్చుకుని దేశంలో పెరుగుతున్న సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. సైబర్ ల్యాబ్‌లను మరింత బలోపేతం చేయడం ద్వారా నేరాలకు అడ్డుకట్ట వేయొచ్చన్నారు. గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉందని, ఇందులో పోలీసులు ప్రముఖపాత్ర పోషించి గంజాయి, డ్రగ్స్‌పై సదస్సులు పెట్టి ప్రజల్లో అవగాహన తీసుకురావాలని సూచించారు.

నిష్పక్షపాతంగా పని చేయాలి : డిజిపి

విధుల్లో చేరే సమయంలో చేసిన ప్రతిజ్ఞలో నిష్పక్షపాతంగా, నిర్భయంగా రాగద్వేషాలకు అతీతంగా ప్రజలకు సేవ చేస్తామని ప్రమాణం చేశారని వీటిని ఉద్యోగ విరమణ పొందే వరకు మరువకూడదని డిజిపి హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. మానవ హక్కులను కాపాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. సైబర్ నేరాల కట్టడికి ప్రతి జిల్లాలోనూ సైబర్ స్టేషన్ ఏర్పాటుకు కృషి జరుగుతోందన్నారు. మహిళలు, చిన్నారులు, అణగారిన వర్గాలపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి రాష్ట్ర పోలీసు శాఖ గట్టి చర్యలు తీసుకుంటోందన్నారు. అనంతరం శిక్షణ సమయంలో ఫైరింగ్, ఇండోర్, అవుట్ డోర్ విభాగాల్లో రాణించిన, ప్రతిభ కనపరిచిన శిక్షణార్థులకు హోంశాఖామంత్రి చేతుల మీదుగా పతకాలు, ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎమ్మెస్ రాజు, పల్లె సింధూర రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శిక్షణ విభాగం ఐజిపి కెవి.మోహన్ రావు, ఏపీఎస్పీ బెటాలియన్స్ విభాగం ఐజిపి రాజకుమారి, కర్నూలు డిఐజి కోయ ప్రవీణ్, ఎస్పీ పి.జగదీష్, వి.రత్న, రాధిక, మీనా, తాడిపత్రి ఎఎస్పీ రోహిత్ కుమార్ చౌదరితో పాటు ఉమ్మడి జిల్లాల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

479 మంది గైర్హాజరు

◆ మొదటి రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

◆ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు

◆ తనిఖీ చేసిన కలెక్టర్, ఇతర అధికారులు

పరీక్ష కేంద్రం వద్ద నెంబర్లను చూసుకుంటున్న విద్యార్థినులు

ప్రజాశక్తి - హిందూపురం, కొత్తచెరువు

శ్రీ సత్యసాయి జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు కావడంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు సైతం పరీక్ష కేంద్రాలకు తరలివచ్చారు. ఎక్కడ ఆలస్యం అవుతుందోనని విద్యార్థులు పరుగు పరుగున పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ప్రథమ సంవత్సర విద్యార్థులకు జరిగిన పరీక్షలో జనరల్ విద్యార్థులు 11,843 మందికిగాను 11,460 మంది హాజరయ్యారు. 383 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ 1580 మందికి గాను 1484 మంది విద్యార్థులు హాజరుకాగ, 96 మంది గైర్హాజరు అయ్యారని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రఘునాథరెడ్డి తెలియజేశారు. శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 42 పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు విద్యార్థులను 8.30 గంటల తర్వాత కేంద్రాల్లోకి అనుమతించారు. పుట్టపర్తి రూరల్ పరిధిలోని మంగళకర జూనియర్ కళాశాలలో జరుగుతున్న పరీక్షలను కలెక్టర్ టిఎస్.చేతన్ తనిఖీ చేశారు. అక్కడి ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడారు. జిల్లా పరీక్షల స్పెషల్ ఆఫీసర్ చెన్నకేశవ ప్రసాద్, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు సురేష్ బాబు, రామరాజు, శ్రీనివాసరెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి వెంకటేశ్వర ప్రసాద్ పర్యవేక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ తదితర వస్తువులను అనుమతించలేదు. పరీక్షలు జరిగే సమయంలో పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ కేంద్రాలు, ప్రింటింగ్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లను బంద్ చేయించారు.

మహిళా సాధికారతకు కృషి చేద్దాం

కలెక్టర్ టీఎస్ చేతన్

ర్యాలీని జండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మహిళా సాధికారతతోనే స్వాలంబన సాధ్యమని కలెక్టర్ టిఎస్.చేతన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్లో జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ కలెక్టరేట్ నుంచి గణేష్ సర్కిల్ వరకు నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పడి భేటి బచావో భేటి పడావో, ఆడపిల్లలను రక్షిద్దాం - ఆడపిల్లలను చదివిద్దాం అంటూ నినాదాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారిత, ఆర్థిక సాంస్కృతిక విజయాలను గుర్తించి వాటిని గౌరవించాలన్నారు. మహిళలకు సమానంగా వనరులు, నాయకత్వ అవకాశాలను కల్పించాలన్నారు. లింగ సమానత్వాన్ని సాధించడంతోపాటు మహిళలపై హింసను నిరోధించాలన్నారు. ఐసిడిఎస్ పీడీ సుధా వరలక్ష్మీ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాలను జిల్లా వ్యాప్తంగా ఈ నెల ఒకటి నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ ఫిరోజ్ బేగం, సిడిపిఒ గాయత్రి, జిల్లా కోఆర్డినేటర్ సురేష్ కుమార్, పిఎ ఉమాదేవి, ఇందు, శిశు గృహ మేనేజర్ సునీత, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛను పంపిణీ

ప్రజాశక్తి -హిందూపురం

సామాజిక భద్రత పింఛన్లు పంపిణీలో భాగంగా శనివారం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ మహిళకు సచివాలయ సిబ్బంది అక్కడికెళ్లి పింఛన్ అందించారు. నేతాజీ నగర్‌లో నివాసం ఉంటున్న లబ్ధిదారురాలు షేక్ ఖైరూన్‌బీకి సచివాలయ కార్యదర్శి జయప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రి చేరుకుని పింఛన్ అందించారు.

గురుకుల పాఠశాలలో శుద్ధ జలప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం రూరల్ మండల పరిధిలోని మలుగూరు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో శనివారం శుద్ధ జలప్లాంట్‌ను ప్రారంభించారు. సాహితీ గగన్‌మహల్ ట్రస్టు వ్యవస్థాపకులు, అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది జె.ప్రతాప రెడ్డి ఆధ్వర్యంలో ముత్తూట్ ఫైనాన్స్ (కొచ్చిన్) ఎండి జార్జి అలెగ్జాండర్ ఆర్థిక సహాయంతో ప్లాంట్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 1000 లీటర్ల సామర్థ్యం గల ఈ జల ప్లాంట్ ఏర్పాటు చేయడంపై పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బిఐ రీజినల్ డైరెక్టర్ ఎంఎన్.స్వామి, ముత్తూట్ ఫైనాన్స్ మేనేజర్ రమేష్, ప్రిన్సిపాల్ జి.సుజాత, వైస్ ప్రిన్సిపాల్ రమణ బాబు, సూపరింటెండెంట్ రమణ, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సివిల్ సప్లయ్ హమాలీల కూలి పెంపుపై హర్షం

ప్రజాశక్తి-బుక్కపట్నం

సివిల్ సప్లై హమాలీల కూలి రేట్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయడం పట్ల శనివా రం హమాలీలు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక సివిల్ సప్లై గోడౌన్‌లో సిఐటియు ఆధ్వర్యంలో మిఠా యిలు పంచుకొని ఆనందం వ్యక్తపరిచారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ మాట్లాడుతూ ఇది కార్మికుల పోరాట విజయమన్నారు. 2024లోనే పెరగాల్సి ఉండగా అప్పటి ప్రభుత్వం కాలయాపన చేయడంతో సిఐటియు, అనుబంధ సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా చేసిన పోరాటా లకు స్పందించి రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. హమాలీలకు కూలి రేట్లు క్వింటాకు రూ. 25 నుంచి రూ. 28కు పెంచడం, గన్ని బేల్ రూ. 50 నుంచి రూ. 55 వరకు, ప్రతి హమాలీకి 3 జతల యూనిఫాం, దసరా బోనస్ రూ. 6వేల నుంచి రూ. 6,500కు పెంచడం పట్ల జిల్లా సిఐటియు కమిటీ హర్షం వ్యక్తం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సిఎస్‌టిడి పరిమళ, సివిల్ సప్లై హమీలల యూనియన్ జిల్లా కోశాధికారి రామదాసు, సిఐఇయు కొత్తచెరువు మండల కన్వీనర్ ముత్యాలు, నాయకులు సుబ్రహ్మణ్యం, మోమిన్, రామాంజి, శివ, గౌస్, నజీర్ పాల్గొన్నారు.

నిత్యావసరాలు సక్రమంగా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-తాడిమర్రి

ప్రభుత్వం నిరుపేదలకు పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకులను రేషన్ డీలర్లు ఖచ్చితమైన తూకాలతో సకాలంలో పంపిణీ చేయాలని డిఎస్ఒ పిజి వంశీకృష్ణారెడ్డి సూచించారు. ఆయన శనివారం తాడిమర్రిలో షాపు-1ను సందర్శించి నిల్వలను తనిఖీ చేసి పంపిణీ విధానాన్ని పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ భాస్కర్‌రెడ్డి, సిఎస్‌డిటి శారదతో కలిసి మండలంలోని రేషన్ డీలర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. డిఎస్ఒ మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టంగా నిర్వహించాలని, ఎక్కడా అవకతవకలకు ఆస్కారం లేకుండా సజావుగా పంపిణీ చేయాలని ఆదేశించారు. డీలర్లకు ఏదైనా సమస్య తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో డీలర్లు ఓబులేసు, భాస్కర్‌గౌడ్, రవీంద్రారెడ్డి, భాస్కర్‌నాయుడు, మోహన్‌గౌడ్, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వెలుగులతో ఉన్న హిందూపురం పట్టణంలోని ధర్మపురం వద్ద ఉన్న నూరాని మసీదు

కనిపించిన నెలవంక

◆ నేటి నుంచి రంజాన్ మాసం ప్రారంభం

◆ ముస్తాబైన మసీదులు

ప్రజాశక్తి - హిందూపురం

ముస్లిములు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ మాసం ప్రారంభమైంది. శనివారం నెలవంక కనిపించగా, ఆదివారం నుంచి ఉపవాసాలు ప్రారంభంకానున్నాయి. రంజాన్ నెల ప్రారంభం కావడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని మసీదులను ప్రత్యేక విద్యుత్ దీపాల అలంకరణలతో ముస్తాబు చేశారు. ముస్లింలు 30 రోజులు ఉపవాస దీక్షలు(రోజా) పాటిస్తారు. ఉపవాస దీక్షలో భాగంగా అల్లాహ్ స్మరణ చేస్తూ తనకు తాను అంతర్గతంగా ఆత్మ ప్రక్షాళన చేసుకుంటారు. సూర్యోదయం కంటే ముందే నిర్దేశిత సమయంలో అన్నపానీయాలు తీసుకుంటారు. దీనినే సహర్ అంటారు. ప్రతి రోజూ కొన్ని నిమిషాల తేడాతో సూర్యాస్తమయంలో ఉపవాసదీక్ష విరమించడమే ఇఫ్తార్. ఇఫ్తార్‌ను ఖర్జూరా, ఇతరత్రా ఫలాలతో విరమిస్తారు.

3న రైతు సదస్సు

ప్రజాశక్తి - హిందూపురం

ఏఐకేఎంఎస్ (అఖిల భారత రైతు, వ్యవసాయ కూలీ సంఘం) ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీ రైతు సదస్సు నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం జిల్లా కార్యదర్శి వి.రంగనాయకులు తెలిపారు. పట్టణంలోని కంచి కామాక్షి కళ్యాణ మంటపంలో ఉదయం 10 గంటలకు రైతుల సమస్యలపై జరిగే రైతుల సదస్సుకు రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రధానంగా హంద్రీనీవా ప్రాజెక్టుకు 40 టీఎంసీల నికరజలాలు కేటాయించి అన్ని చెరువులకు నీరు అందించాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, గృహాలు, బోర్లకు స్మార్ట్ మీటర్ల బిగింపును ఆపాలని, రైతులు వేసే పాలకు లీటర్‌పై 5 రూపాయల ప్రోత్సాహం చెల్లించాలన్నారు. ఈ సదస్సులో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ అమరవీరులకు నివాళి

హిందూపురం : ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన ఎమ్మార్పీఎస్ నేతలకు శనివారం స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ నేతత్వంలో ఎస్సీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణ కోసం 30 సంవత్సరాల పాటు ఎన్నో ఉద్యమాలు జరిగాయన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. వారి త్యాగం మరువలేనిదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ తాలూకా అధ్యక్షులు సతీష్ కుమార్, జిల్లా గౌరవ అధ్యక్షులు ఆంజినేయులు, పార్లమెంట్ అధ్యక్షులు ఆనంద్, తాలూకా ఉపాధ్యక్షులు శ్రీరాములు, రామ్మూర్తి, పట్టణ అధ్యక్షులు నరసింహులు, రూరల్ ఇన్‌ఛార్జి నాగార్జున, ఎంఈఎఫ్ నాయకులు బండారు శంకర్ పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేస్తాం

◆ బడ్జెట్‌లో రైతులు, బీసీలకు పెద్దపీట

◆ జగన్‌లా మాట తప్పే నైజం చంద్రబాబుది కాదు

◆ రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత

రోడ్డు శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-సోమందేపల్లి

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేలా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. శనివారం ఆమె సోమందేపల్లి మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మాగెచెరువులో రూ. 12 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ సూపర్ సిక్స్ అమల్లో భాగంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎందరు విద్యార్థులుంటే అందరికీ ఏడాదికి రూ.15 వేలు అందజేస్తామన్నారు. అన్నదాత పథకాన్ని కూడా జూన్‌లోనే అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 8వ తేదీన మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 85 వేల మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సోమందేపల్లిలో టైలరింగ్ శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. ఇందులో మహిళలంతా పేర్లు నమోదు చేసుకోవాలని మంత్రి సూచించారు. త్వరలో రేషన్ కార్డులు, ఆటోలు పంపిణీ చేయనున్నట్లు తెలియజేశారు. శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో రైతులకు, బీసీలకు సీఎం చంద్రబాబునాయుడు పెద్దపీట వేశారన్నారు. వైఎస్ జగన్‌లా చంద్రబాబు నాయుడు మాట తప్పే మనిషి కాదన్నారు. జగన్ అధికారంలో ఉన్న్ని రోజులూ కనీసం కాలువల్లో తట్ట మట్టి కూడా వేయలేదని విమర్శించారు. ఇక తమ ప్రభుత్వంలో కక్ష సాధింపులకు తావేలేదన్నారు. జగన్ హయాంలో వైసీపీ మూకలు బరితెగించి, రాజ్యాంగాన్ని అతిక్రమించి దౌర్జన్యాలకు, దారుణాలకు ఒడిగట్టారన్నారు. వారందరూ ఇప్పుడు శిక్షలు అనుభవిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాగే చెరువు నరసింహులు, మాజీ జడ్పిటిసి వెంకటరమణ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డివి.ఆంజనేయులు, మాజీ ఎంపీపీ వెంకటేష్, కన్వీనర్ సిద్ద లింగప్ప, నీరుకంటి చంద్ర, భాను కీర్తి, రైతు సంఘ నాయకులు హరికృష్ణతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

కదిరిని అభివృద్ధి చేసి చూపిస్తా : ఎమ్మెల్యే

బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పై సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాష్ట్ర బడ్జెట్, సిఎం చంద్రబాబు సమర్థవంతమైన నాయకత్వాన్ని చూసి వైసిపి అధినేత జగన్ ఎంతో నేర్చుకోవాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హితవు పలికారు. పట్టణంలోని తన నివాసంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చినప్పుడు నుంచి రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు తీస్తుందన్నారు. బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకునేలా ఉందన్నారు. వెనుకబడిన వర్గాలకు బడ్జెట్లో రూ. 47 వేల కోట్లు కేటాయించడం హర్షించదగ్గ విషయం అన్నారు. వైసిపి హయాంలో విధ్వంసకరమైన ఆలోచన ఉండేలా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని విమర్శించారు. నియోజవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపేలా చొరవ తీసుకుంటున్నా మన్నారు. హంద్రీనీవా జలాలను తలుపుల మండలాకి తెప్పించామన్నారు. రూ. 26 కోట్లతో సురక్షిత శుద్ధ జలాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గాండ్లపెంట, తలుపుల మండలాలకు హంద్రీనీవా జలాలు ఇచ్చే బాధ్యత తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు : ఎమ్మెల్యే

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. ఈ నెల 9వ తేదీ నుంచి ప్రారంభమయ్యే శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై పట్టణంలోని శ్రీవారి ఆలయంలో ఆలయ అధికారులు, పట్టణ ప్రజలు, పలు పార్టీల నాయకులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో వివిఎస్ శర్మ, ఈవో శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పార్థసారధి, వంశీ, అధికారులు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే

ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని 29, 30 వార్డుల్లో ఎమ్మెల్యే కందికుంట ఇంటింటికి వెళ్లి పింఛను పంపిణీ చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల హామీలను అన్నింటినీ నెరవేర్చేలా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

'సోలార్' ప్రాజెక్టులతో రైతులకు అన్యాయం జరిగితే ఉపేక్షించం

ప్రజాశక్తి-నంబులపూలకుంట

సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు క్రమంలో ఎదురైన సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని సిపిఎం మండల నాయకులు గంగిరెడ్డి, సిఐటియు నాయకుడు నాగరాజు మండిపడ్డారు. వారు శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటికే నంబులపూలకుంట, పి.కొత్తపల్లి గ్రామాల్లో అల్ట్రా మెగా సోలార్ ప్రాజెక్ట్ వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తూ ఆయా కంపెనీలు లాభాలు గడిస్తున్నాయన్నారు. పెడబల్లి గ్రామంలో వంద మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి ఓ ప్రయివేటు కంపెనీ ముమ్మరంగా పనులు చేపడుతుందన్నారు. మర్రికొమ్మదిన్నె గ్రామ పంచాయతీలో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం మండల రెవెన్యూ యంత్రాంగం భూసేకరణ కోసం ఇటీవలే గ్రామసభ ఏర్పాటు చేసిందన్నారు. పంటలు పండే రైతుల భూములను లాక్కొని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు. భూ నిర్వాసిత రైతు కుటుంబాలకు ప్రభుత్వ భూములు ఇవ్వాలని, కుటుంబంలోని నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేసే గ్రామాల్లో పశువులు, గొర్రెలు, మేకలు, తదితర జీవాల కోసం పచ్చిక బయళ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు అన్యాయం జరిగితే వారి పక్షాన సిపిఎం పోరాడుతుందని హెచ్చరించారు.

పింఛన్లు పంపిణీ చేసిన కలెక్టర్, ఎంపి

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

సచివాలయ ఉద్యోగులు పింఛను దారుల ఇంటి వద్దకు వెళ్లి నగదు అందజేయాలని జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయమే కలెక్టర్ మండలంలోని అప్పల వాండ్లపల్లి గ్రామం వెళ్లి వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛను సొమ్ము అందజేశారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ప్రతి నెలా 1వ తేదీనే ఉదయం నుంచి సాయంత్రం లోపు పింఛన్లను సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. ఇంటి వద్దకే వచ్చి పింఛను ఇస్తున్నారా లేదా అని మంజుల అనే మహిళను అడిగి తెలుసుకున్నారు. పింఛను డబ్బులను దుర్వినియోగం చేయకుండా మీ అవసరాలకు ఉపయోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆయన వెంట ఎంపిడిఒ ఏజీ నటరాజ్, వీఆర్వో రమేష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ టిఎస్.చేతన్

గోరంట్ల : మండలంలోని చుండూరు వాండ్లపల్లెలో శనివారం చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎంపి బికె.పార్థసారథి పాల్గొని పలువురు లబ్ధిదారులకు నగదు అందజేశారు. ఎంపి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా కూటమి ప్రభుత్వం ఎపిలో రూ. 4 వేల పింఛను ఇస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవ, నరసింహప్ప, అశ్వత్థరెడ్డి, నీలకంఠారెడ్డి, బాలాజీ, నరేంద్ర, వెంకటరంగారెడ్డి, డాన్స్ కిష్టప్ప, సుధాకర్‌రెడ్డి, మణిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఎంపి

'ఆశా'ల సమస్యలపై 6న ధర్నా

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఆశా వర్కర్ల సమస్యలపై ప్రభుత్వం చర్చలు జరిపి ఒప్పందం కాపీని విడుదల చేసి ఏడాదైనా జీవోలు విడుదల చేయలేదని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్, సిఐటియు నాయకులు ఈఎస్.వెంకటేష్, సాంబయ్య, సౌభాగ్య విమర్శించారు. పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో శనివారం ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షులు సౌభాగ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆశా వర్కర్ల సమస్య లపై ఈ నెల 6వ తేదీ చేపట్టనున్న ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక హక్కులను హరిస్తుందన్నారు. వైద్య ఆరోగ్య రంగానికి నిధుల కేటాయింపులు నానాటికీ తగ్గుతున్నాయని, ప్రజా ఆరోగ్యానికి భద్రత కరువైందన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న సిఐటియు, ఆశా వర్కర్లు

ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించి, కమ్యూనిటీ హెల్త్ వర్కర్‌ని ఆశాలుగా మార్పు చేయాలని, ఒప్పంద జీవోలను విడుదల చేయాలని, ఎఎన్‌ఎం శిక్షణ పొందిన వారికి పర్మినెంట్ ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పించాలని, దశలవారీగా ఆశా వర్కర్లకు ఎఎన్‌ఎం శిక్షణ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల జిల్లా యూనియన్ నాయకులు, ఆఫీస్ సిబ్బంది సిద్ధు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల్లో భూ వివరాలు చూపలేదని రైతుల వినతి

ప్రజాశక్తి-తాడిమర్రి

రీ సర్వే తర్వాత తమ భూములు రికార్డుల్లో కనిపించకుండా పోయాయని, పరిశీలించి న్యాయం చేయాలని కోరుతూ శనివారం మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన 30 మంది రైతులు తహశీల్దార్ భాస్కర్‌రెడ్డి ఎదుట మొరపెట్టుకున్నారు. రామాపురం సర్పంచి కుంటాల పుల్లయ్య ఆధ్వర్యం లో బాధిత రైతులు రాజగోపాల్, పరశురాముడు, పెద్ద కుళ్లాయప్ప, రామయ్య, దామోదర, వీరనారప్ప, కుళ్లాయప్ప, నారాయణ స్వామి, ప్రదీప్, రామకృష్ణ, శంకర, నాగార్జున, తదితర రైతులు తహశీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ వైసిపి హయాంలో మా భూములను రీ సర్వే చేశారని, ఆ తర్వాత కొద్దిపాటి తేడాలతో తమ భూములు రికార్డుల్లో

తహశీల్దార్ భాస్కర్‌రెడ్డికి సమస్యను వివరిస్తున్న రైతులు

భద్రంగా ఉన్నాయన్నారు. అయితే ప్రస్తుతం రికార్డులను పరిశీలిస్తే మా భూములకు సంబంధించి వన్-బి, అడంగల్ కనిపించ లేదని ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన తహశీల్దార్ భూ రికార్డుల్లో జరిగిన అవకతవకలను పరిశీలించి రైతుల భూములను రికార్డుల్లోకి చేరుస్తామని హామీ ఇచ్చారు.

సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

నాయీ బ్రాహ్మణులకు ఆదరణ పథకంతో పాటు ఉచిత విద్యుత్ ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల శనివారం నాయీబ్రాహ్మణ జిల్లా సాధికార సమితి సభ్యుల ఆధ్వర్యంలో సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ నాయీ బ్రాహ్మణులకు ఆదరణ పథకం కింద రూ. 1000 కోట్లు మంజూరు చేశారన్నారు. అలాగే సెలూన్ షాపులకు ఉచిత విద్యుత్ ఇవ్వడం కోసం రూ. 450 కోట్లు కేటాయించారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.నాగరాజు, వేముల రామకృష్ణ, శ్రీరాములు, శ్రీనివాసులు, నాగరాజు, బి.శ్రీనివాసులు, పురుషోత్తం, ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రగతి, గ్లోబల్ జెన్ పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యనందించాలని ఉపవిద్యాధికారి పద్మప్రియ, ఎంఇఒ సుధాకర్ సూచించారు. పట్టణంలోని ప్రగతి గ్లోబల్ జెన్ సిబిఎస్ఇ పాఠశాల 38వ వార్షికోత్సవం వేడుకలను శనివారం కరస్పాండెంట్ శ్రీనివాసులు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక అలరించాయి. చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు ముఖ్య అతిథులుగా హాజరైన డిప్యూటీ డిఇఒ పద్మప్రియ, ఎంఇఒ సుధాకర్ మెడల్స్, షీల్డ్స్, సర్టిఫికెట్స్ అందజేశారు. డిప్యూటీ డిఇఒ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులు, పాఠశాల, గురువులు, ఊరుకి మంచిపేరు తేవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్, మినీ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో శనివారం హెల్పర్స్‌కి ప్రాజెక్టు సమావేశం నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ ఎన్నికల ముందు చేపట్టిన సమ్మె కాలపు హామీల అమలు కోసం మార్చి 10వ తేదీ విజయవాడలో చేపట్టనున్న ధర్నాకు వర్కర్స్, హెల్పర్స్, మినీ వర్కర్స్ తరలివెళ్లి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సిడిపిఒ శాంతలక్ష్మికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి భావమ్మ, లీడర్లు చంద్రమ్మ, కవిత, మాలతి, పెనుకొండ, రొద్దం మండలాల హెల్పర్లు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ ఉపాధ్యాయురాలికి సన్మానం

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక ఎంపిపి మెయిన్ స్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు రాజేశ్వరీ శనివారం ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఎంఇఒ ఆంజనేయులునాయక్, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నాగేంద్ర ప్రసాద్ ఆమెను పాఠశాలలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ రాజేశ్వరి విద్యార్థులకు తనదైన శైలిలో విద్యను బోధించి ఎందరికో ఆదర్శంగా నిలిచారని కొనియా డారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ నాయకులు జవ్వాజి నాగరాజు, సంజీవ రాయుడు, చంద్ర, ఇర్ఫాన్, నరసింపమూర్తి, రంగేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వినతి

ప్రజాశక్తి-మడకశిర

అనంతపురం జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత శనివారం అనంతపురంలో ఎమ్మెల్యే ఎంఎస్.రాజు నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాల్మీకి, బోయ లను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కృషి చేయాలని మంత్రికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే భార్య ఉమాదేవి, ఎపి వాల్మీకి బోయ సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షులు మాధవయ్య, క్రాంతికుమార్, ఆదినారాయణ, నగర అధ్యక్షులు కుళ్లాయప్ప, కేశవ, బళ్లారి గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో రూ. 7 కోట్లు వృథా : ఎంపిపి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఉపాధి హామీ పనుల్లో రూ. 7 కోట్ల వరకూ వృథా అయ్యాయని ఎంపిపి ఆదినారాయణయాదవ్ విమర్శించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం

మండల సమావేశంలో పాల్గొన్న అధికారులు

ఎంపిపి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారులు సమస్యలపై చర్చించారు. ప్రజల సమస్యలు, అభివృద్ధి కోసం మండల అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించా లన్నారు. సర్పంచులు, ఎంపిటిసిలు సమస్యలను ప్రస్తావించగా మంత్రి సత్య కుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో తహశీల్దార్ నారాయణస్వామి, ఎంపిడిఒ దివాకర్, వైస్ ఎంపిపి వెంకటరెడ్డి, జడ్పిటిసి తిరుమలసేవేనాయక్, కో ఆప్షన్ నెంబర్ చిన్న బాలముని, ఏఓ నరసింహులు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ప్రసాద్, మండల అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, పలు శాఖ అధికారులు పాల్గొన్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఎమ్మెల్యే సింధూర ఇంట్లో సమావేశమైన మంత్రి అనిత

హోం మంత్రిని సన్మానించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కొత్తచెరువు

అనంతపురం నగర శివారు ప్రాంతంలోని ఆలమూరు రోడ్డులో ఉన్న మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి నివాసానికి శనివారం రాష్ట్రహోంమంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యే ఎంఎస్.రాజు వెళ్లారు. ముందుగా హోంమంత్రికి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, పివికెకె ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ పల్లె వెంకటకృష్ణకిషోర్‌రెడ్డి దంపతులు పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానించారు. మంత్రికి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పసుపు, కుంకుమ, చీరను బహూకరించి సన్మానించారు. పుట్టపర్తి నియోజకవర్గంలో నూతన పోలీస్‌స్టేషన్లు, పోలీస్ అధికారులు, సిబ్బంది నియామకం, నూతన వాహనాల మంజూరు, తదితర అంశాలను ఎమ్మెల్యే హోంమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వారితో పాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే కుమారుడు వియాన్ ఉన్నారు.

బత్తలపల్లిలో డిఎంహెచ్ఒ పర్యటన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండలంలోని బత్తలపల్లి గ్రామంలో శనివారం వైద్యాధికారులు తనిఖీలు నిర్వహించారు. డిఎంహెచ్ఒ ఫిరోజ్‌బేగం, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి 104 ఫ్యామిలీ డాక్టర్, ఎన్‌సిడిసిడి కార్యక్రమాలను పరిశీలించారు. స్క్రీనింగ్ పరీక్షలు సజావుగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం 10 గృహాలను సందర్శించి ఏవైనా పొరపాట్లు, లోటుపాట్లు ఉన్నాయేమో అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎటువంటి పొరపాట్లు ఉండకూడదని సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ జ్యోత్స్న, హెల్త్ సూపర్వైజర్ రమణ, ఎంఎల్‌హెచ్‌పి సత్యమ్మ, హెల్త్ అసిస్టెంట్ శివ, ఆశ, లక్ష్మీనరసమ్మ, లక్ష్మీదేవి, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభం ప్రతిష్టాపన

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని చండూరువాండ్లపల్లి గ్రామంలో శనివారం ఆంజనేయస్వామి ఆలయంలో ధ్వజ స్తంభం ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. డాన్స్ కిష్టప్ప కుటుంబ సభ్యుల సహకారంతో ఆలయంలో 41 అడుగుల ధ్వజ స్తంభాన్ని ప్రతిష్టించారు. ముఖ్య అతిథులుగా ఎంపి బికె.పార్థసారథి హాజరయ్యారు. డాన్స్ కృష్ణప్ప కుమారుడు బాలాజీ దంపతులు ధ్వజస్తంభ ప్రతిష్ట పూజల్లో పాల్గొన్నారు. అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి సుధాకర్‌రెడ్డి, దేవా, నరసింహప్ప, నీలకంఠారెడ్డి, నరేంద్ర, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి అశ్వత్థ్‌రెడ్డి, వెంకటరంగారెడ్డి, మణిశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండలంలోని గొట్లూరు జడ్పీ హైస్కూల్‌లో శనివారం దర్శినమల పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ పుష్పలత ఆధ్వర్యంలో ప్రభుత్వ నేత్ర వైద్యులు డాక్టర్ ఉరుకుందప్ప విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. పలువురు విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. అనంత రం విద్యార్థులు కళ్ల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కంటి వైద్యులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య బృందం పర్యటన

ప్రజాశక్తి-నల్లచెరువు

స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కల్పనారెడ్డి ఆధ్వర్యంలో వైద్యబృందం ఉప్పార్లపల్లి గ్రామాన్ని సందర్శించారు. నీటి నిల్వలపై స్ప్రే చేయించారు. ఇళ్లకు వెళ్లి ఫీవర్ సర్వే, లార్వా సర్వే చేశారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం బాలేపల్లితండా, ఊరువాయి, కె.పూలకుంట, దామవాండ్లపల్లి, పోలేవాండ్లపల్లి, ఇతర గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించారు. స్ప్రే, బ్లీచింగ్ పౌడర్ చెల్లించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి సిహెచ్ఒ రామచంద్రా రెడ్డి, మలేరియా సబ్ యూనిట్ అధికారి రామానుజులు, సూపర్వైజర్లు మహబూబ్‌బాషా, సుధాకర్, హెల్త్ అసిస్టెంట్లు సూర్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎఎన్‌ఎం భాగ్యమ్మ, ఎంఎల్‌హెచ్‌పి హరిత, ఆశా కార్యకర్త సౌందర్య పాల్గొన్నారు.

గౌరవ వేతనం ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి-పెనుకొండ

కురుబల గుడికట్ల పూజారులకు గౌరవ వేతనం మంజూరు చేయించాలని కోరుతూ శనివారం పట్టణంలోని మంత్రి కార్యాలయంలో కురుబ కులగుడికట్ల పూజారులు మంత్రి సవితకు వినతి పత్రం అందజేశారు. వినతి ఇచ్చిన వారిలో పూజారులు రాధాకృష్ణ, చంద్రమౌళి, నరేష్, ఆదినారాయణ, అశ్వర్థనారాయణ పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం సిడిపిఒ లక్ష్మి ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సిడిపిఒ మాట్లాడుతూ కిశోర బాలికల విద్య సమాజానికి అత్యంత అవసరం అన్నారు. బాల్య వివాహాలు చేయడం నేరమన్నారు. ఇలాంటి విషయాలపై అంగన్వాడీ, ఆశా వర్కర్లు పిల్లల తల్లితండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. తల్లిపాల ప్రాధాన్యతను తెలిపారు. కార్యక్రమంలో పలు వార్డుల్లోని అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులు, ఐసిడిఎస్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాల ర్యాలీలో పాల్గొన్న ఐసిడిఎస్ సిబ్బంది

అర్జీలను సకాలంలో పరిష్కరిస్తాం : మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రజలు ఇచ్చిన వినతులను పరిశీలించి సకాలంలో పరిష్కరించి న్యాయం చేస్తామని రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శనివారం మండలంలోని గుట్టూరు, మునిమడుగు, దుద్దేబండ, వెంకటగిరిపాళ్యం, ఎర్రమంచి పంచా యతీ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. భూ సమస్యలు, ఉపాధి అవకాశాలు, కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు, తొలగించిన పింఛన్ల పునరుద్ధరణ కోసం వినతులు అందాయి. త్వరలోనే మార్గదర్శకాలు వస్తాయని, అర్హులందరికీ న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన సమస్యలను అధికారులకు బదిలీ చేశారు. అనధికారిక లేఔట్లు వేస్తే చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి సవిత

ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి ఈఈ సంజీవయ్య, ఆర్డీవో ఆనందకు మార్, తహశీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో నరేష్‌కృష్ణ, టిడిపి మండల, పట్టణ కన్వీనర్లు సిద్దయ్య, శ్రీరాములుయాదవ్, నాయకులు నారాయణస్వామి, వెంకటరాముడు, కేశవయ్య, సూర్యనారాయణ, బోయ రామకృష్ణ, పోతిరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

గిరిజన తండాలు, గ్రామీణ ప్రాంతాల్లో నాటుసారా తయారీదారులకు అవగాహన కల్పించాలని, సారా తయారీకి దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో సువర్ణ అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నాటుసారా నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఆర్డీవో సువర్ణ, ఎక్సైజ్ సూపరిం టెండెంట్ గోవిందనాయక్ హాజరయ్యారు. ఆర్డీవో మాట్లాడుతూ పోలీసు, ఎక్సైజ్, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా ప్రజల్లోకి వెళ్లి అవగాహన కల్పించి నాటుసారా నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ బుక్కపట్నం మండలంలో నార్సింపల్లి తండా, పాముదుర్తి, మారాలా, గసిగివారిపల్లి, పుట్టపర్తి మండలంలోని పెడపల్లితండా, నల్లమాడ మండలంలోని మదిరేపల్లి, రెడ్డికుంట, నేలవంకతండా, తదితర తండాల్లో నాటుసారా తయారీని అరికట్టేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. గైర్హాజరైన ఎంపిడిఒలు, తహశీల్దార్లు, సెక్రటరీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సువర్ణ

కార్యక్రమంలో ఎంపిడిఒ నాగేశ్వరరెడ్డి, పుట్టపర్తి, నల్లమాడ తహశీల్దార్లు, డిపిఒ ఆఫీస్ ఏవో, పుట్టపర్తి ఎక్సైజ్ సిఐ నాగరాజు, ఎస్ రాజు, సిబ్బంది, నల్లమాడ సిఐ, బుక్కపట్నం ఎస్ఐ, పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డిఒ మహేష్, పోలీసు, రెవెన్యూ అధికారులతో నవోదయం-2.0పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో నాటుసారా తయారీని పూర్తిగా నిర్మూలించే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందులో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో జిల్లా ఎక్సైజ్ అధికారులు గోవిందనాయక్, సిఐ చంద్రమణి, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల పోస్టుకార్డు ఉద్యమం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మున్సిపల్ కార్మికులను ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించవద్దని కోరుతూ మున్సిపల్ కార్మికులు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. ఈ మేరకు శనివారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు పోస్టుకార్డులను పోస్టు బాక్స్‌లో వేసి నిరసన తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి పైపల్లి గంగాధర్ మాట్లాడుతూ ఆప్కాస్ ముద్దు.. ప్రయివేటు ఏజెన్సీల విధానం వద్దని సిఎంకు పోస్ట్‌కార్డుల ఉద్యమం ద్వారా తెలుపుతున్నామన్నారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఆప్కాస్ విధానమే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాలు

పోస్టు బాక్సులో కార్డులు వేస్తున్న నాయకులు

చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్ల యూనియన్ నాయకులు నాగార్జున, వెంకటేష్, తిరుపాలు, రమేష్, వెంకటేశు, షేక్షావలి, తదితరులు పాల్గొన్నారు.

'వాల్టా' అమలుకు స్పెషల్ టీం ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి-కొత్తచెరువు

వాల్టా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు స్పెషల్ టీంను ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం పర్యావరణవేత్త భాస్కర్‌నాయుడు పుట్టపర్తి ఆర్డీవో సువర్ణకు వినతి పత్రం ఇచ్చారు. భాస్కర్‌నాయుడు మాట్లాడుతూ వాల్టా చట్టాన్ని ధిక్కరించి డివిజన్ వ్యాప్తంగా ప్రతిరోజూ వందల సంఖ్యలో చెట్లను నరికి అక్రమంగా సామిల్లులు, ఇటుక బట్టీలు, పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నార న్నారు. సామిల్లులు, తదితర ప్రాంతాల్లో వేల టన్నుల కలప నిల్వ చేసినా ఏ ఒక్క అధికారి అటువైపు కన్నెత్తి చూడడం లేదని విమర్శించారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. కొందరు అటవీ శాఖ అధికారులు మామూళ్లకు అలవాటు పడి అక్రమార్కులకు అండగా పని చేస్తున్నారన్నారు. కావున ప్రకృతి సంపదను కాపాడేలా తక్షణమే ప్రత్యేక టీంను ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన వెంట ఎన్‌హెచ్‌ఆర్‌సి ఎన్‌టిటి డిస్ట్రిక్ట్ కౌన్సిల్ మెంబర్ దివాకర్ ఉన్నారు.

ఇళ్ల స్థలాల కోసం 3న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

అర్హులైన పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2సెంట్ల ఇళ్ల స్థలం ఇస్తామని సిఎం చంద్రబాబు ప్రకటించి జీవో విడుదల చేసినా ఇంతవరకు అమలు కాలేదని, అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈ నెల 3వ తేదీ సిపిఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నా చేపట్టనున్నట్లు సిపిఐ నాయకులు పిలుపునిచ్చారు. ఆ ధర్నాకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హాజరువుతారని, పేదలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిపిఐ పుట్టపర్తి నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుని వెంటనే కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమలో సిపిఐ మండల కార్యదర్శి చలపతి, నాయకులు, రత్నాబాయ్, రమణ, నారాయణ, వెంకటరమణ, గంగులమ్మ, అంజనప్ప, సురేష్ పాల్గొన్నారు.

ఆశలు నెరవేరేనా ?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ బడ్జెట్‌లను ప్రవేశపెట్టాయి. ఈ రెండు బడ్జెట్‌లు పరిశీలిస్తే దేశంలోనే అత్యంత వెనుకబడిన అనంతపురం జిల్లాకు ఏ మేరకు ప్రాధాన్యతనిచ్చాయన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. అదే కరువు, అదే వలసలు ఇప్పటికీ ఇక్కడ కొనసాగుతూనే ఉన్నాయి. వర్షం పడితే పంటలు లేకపోతే కరువు అన్నట్టుగా ఉంటోంది. ఇప్పటికే 70 శాతానికిపైగా వర్షాధారంపైనే ఆధారపడి పంటలు సాగు చేసుకునే పరిస్థితులున్నాయి. రాష్ట్ర విభజన సమయంలో వెనుకబడిన అనంతపురం జిల్లా వంటి వాటికి ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామన్న హామీని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. 2025-26 కేంద్ర బడ్జెట్‌లోనూ మొండి చేయి చూపింది. కనీసం కేంద్రీయ విశ్వవిద్యాలయంకు రెండేళ్లుగా ఒక్క పైసా నిధులు విడుదల చేయకపోవడం గమనార్హం. ఇప్పుడు జరుగుతన్న విశ్వవిద్యాలయంలో మౌలిక సదుపాయాల్లేక విద్యార్థినులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ అన్ని రకాల సౌకర్యాలతో ఎప్పుడు పూర్తి చేస్తారన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. ఇక రాష్ట్ర బడ్జెట్‌లోనైనా జిల్లాకు దిశా నిర్దేశం చేస్తుందా అని చూస్తే అదీ లేకుండాపోయింది. అయితే గుడ్డిలో మెల్లలగా హంద్రీనీవాకు నిధుల కేటాయింపుల్లో కొంత ప్రాధాన్యతనిచ్చింది. ఇందులో వినియోగంపై కొంత సందేహాలున్నాయి. రెండో దశలో లైనింగ్ వద్దని ఒకవైపు రైతులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వాటిని పెద్దగా పట్టించుకుంటున్న దాఖలాల్లేవు. ఇక జిల్లాకు నిఖర జలాలు అందించే తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువను పూర్తిగా విస్మరించినట్టే కనిపిస్తోంది. ఆధునీకరణ ఊసే ఎత్తలేదు. ఇక గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ ఆధునీకరణ, మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువ ఆధునీకరణ పనులు ఎక్కడివక్కడి ఆగిపోయి ఉన్నాయి. అంతేకాకుండా మిడ్‌పెన్నార్ డ్యామ్ మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. వీటికి నిధుల కేటాయింపులు పెద్దగా లేనట్టుగానే కనిపిస్తున్నాయి. ఇక పండిన పంటలకు గిట్టుబాటు ధరలేక రైతులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా మిర్చి పంట పండుతుంది. ఈ పంటకు ధరలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా పప్పుశనగకు ధరలేదు. వీటిని ప్రభుత్వం కొనుగోలు చేస్తామని చెబుతున్నప్పటికీ కొనుగోలు చేసే సమయంలో అనేక షరతులు పెడుతోంది. వీటికి ఈ బడ్జెట్‌లో పెద్దగా కేటాయింపుల్లేవన్న విమర్శలున్నాయి. ఇలా ప్రధానమైన సమస్యలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు కూడా వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఆశించిన కేటాయింపులు జరపలేదు. నిరాశపరిచేవిధంగా ఉందని విపక్షాలు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

బైక్, ఆర్టీసీ బస్సు ఢీ.. ఒకరు మృతి..

ఇంటర్ విద్యార్థికి గాయాలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

చెన్నై-అనంతపురం జాతీయ రహదారిపై శనివారం పట్టణ సమీపంలో కుటాగుళ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇంటర్ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన సయ్యద్‌బాషా, దాదాపీర్(24) వరసకు అన్నదమ్ములు. సయ్యద్‌బాషా ఉదయం పట్టణ సమీపంలోని కుటాగుళ్ల వద్ద ఉన్న బ్లూమూన్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షకు హాజరయ్యాడు. దీంతో దాదాపీర్ ద్విచక్ర వాహనంపై బ్లూమూన్ కళాశాల వద్దకు వెళ్లి పరీక్ష ముగిసిన తర్వాత సయ్యద్‌బాషాతో కలిసి ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యలో వీరిని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో దాదాపీర్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన సయ్యద్‌బాషాను కదిరి ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాదాపీర్ మడకశిర ప్రాంతంలో పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. అతడికి నెల క్రితమే వివాహం కాగా అంతలోనే అనంత లోకాలకు వెళ్లడంతో కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మండలంలోని వీరాంజనేయపల్లి వద్ద మామిడి తోటలో శనివారం ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పెనుకొండ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. బుక్కపట్నం మండలంలోని కొత్తకోటకు చెందిన నగేష్ కొంతకాలంగా వెంగళమ్మచెరువు గ్రామానికి వచ్చి ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఇటీవలే ఆటో అమ్మి ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

9న కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రోటరీ క్లబ్, శంకర కంటి ఆసుపత్రి-బెంగళూరు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఈ నెల 9వ తేదీ ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షులు జయ సింహ, కార్యదర్శి నాగభూషణ, కోశాధికారి సుదర్శన్‌గుప్తా తెలిపారు. వారు శనివారం పట్టణంలోని సాంస్కృతిక మండలిలో వైద్య శిబిరం కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ లలితమ్మ, బిఎల్ వెంకటరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు జివి రాజగోపాల్‌రెడ్డి, కోడలు సుగుణమ్మ సహకారంతో పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాంస్కృతిక మండలి వ్యవస్థాపకులు సత్రశాల ప్రసన్నకుమార్, అసిస్టెంట్ గవర్నర్ రత్నశేఖర్‌రెడ్డి, కొండయ్య, బోనాల శివయ్య, పెరుమాల దాస్, గట్టు హరినాథ్, బండారు వెంకటాచలం పాల్గొన్నారు.

4న న్యూరాలజీ వైద్య శిబిరం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని స్పందన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఈ నెల 4వ తేదీ నిర్వహిస్తున్న ఉచిత న్యూరాలజీ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్పందన హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియా సూచించారు. శనివారం వారు మాట్లాడుతూ స్పందన ఆసుపత్రిని 'స్పందన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా' మార్చి వైద్య సేవలను ప్రారంభించామన్నారు. శిబిరంలో మెదడు, వెన్నుపాము, నరాలు, మూర్ఛ, అల్జీమర్స్, కాళ్లు, చేతుల జోములు, తిమ్మిర్లు, మైగ్రేన్ తలనొప్పి, తదితర జబ్బులకు చికిత్స చేస్తామన్నారు. షుగర్, బిపి, ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు.

చేనేత క్లస్టర్ ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

పట్టణంలో రూ. 35 కోట్ల వ్యయంతో చేనేత మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటు కోసం శనివారం మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు, హ్యాండ్లూమ్ జెడి రాజారావు, ఆర్డీవో మహేష్, తహశీల్దార్ నటరాజ్, ఇతర అధికారులతో కలిసి వ్యవసాయ మార్కెట్ యార్డులో స్థలాన్ని పరిశీలించారు. అలాగే ఆ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రణాళికలను సమీక్షించారు. హరీష్‌బాబు మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ ద్వారా చేనేత పరిశ్రమకు పునరుద్ధరణ, మరింత అభివృద్ధి సాధన లక్ష్యంగా పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న హరీష్‌బాబు, అధికారులు

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE : GOOTY.
O.S.No.06/2024

Between:
K.Ravindranath ...Plaintiff
And
K.Lokendranath and others ...Defendants

2వ ప్రతివాదికి నోటీసు

D2:S.Komala Devi W/o Sathyanarayana Rao, Housewife, R/o D.No.3-99, Janakiramaiah Colony, Near Church, Prasanthi Gram, Puttaparthi, Sri Sathya Sai Dist.

పై దావాలోని వాది దావాను బాగాపరిస్కారం కొరకు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావా మీ యొక్క హాజరు నిమిత్తం 24/03/2025 నాటికి వాయిదా వేసియున్నారు. ఆ దినం మీరు పై కోర్టు ఎదుట ఉ.10:30 గం॥లకు వకీలు ద్వారా గానీ లేదా స్వయముగా గానీ హాజరై మీ యొక్క అభ్యంతరములు తెలుపుకొనగలరు. లేనిచో పై దావా మీ పరోక్షమందు తీర్మానం కాగలరు.

(G.Sreekanth Reddy)
Advocate for Plaintiff